క్లుప్తంగా

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

మొగల్తూరు: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని వారితిప్ప సర్పంచ్ తిరుమాని శాంతకుమారి సూచించారు. శుక్రవారం మండలంలోని వారతిప్ప గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు తిరుమాని ఏడుకొండలు, హెచ్ఎం చీపుర్ల సూర్యప్రకాష్, ఉపాధ్యాయులు బర్రి నాగరాజు, తిరుమాని వెంకటేశ్వర్లు, దొంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ మరమ్మతుల పరిశీలన



పెనుగొండలో పైప్‌లైన్ మరమ్మతులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ శ్యామలాసోనీ

పెనుగొండ: పెనుగొండలోని బాలికోన్నత పాఠశాల వైపు వెళ్లే పంచాయతీ పైపులైన్ మార్గం రిపేర్ రావడంతో తాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. దీంతో శుక్రవారం మరమ్మతులు ప్రారంభించారు. మరమ్మతులను పెనుగొండ సర్పంచ్‌నక్కా శ్యామలా సోనీ పర్యవేక్షించారు. మరమ్మతులు పూర్తి చేసి తాగునీటి సరఫర పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



వీఎస్ రాజు, బిక్షమ్‌లను అభినందిస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్యం

నరసాపురం రూరల్: సైబర్ నేరాలపై విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని హైదరాబాద్ ట్రాయ్‌కు చెందిన ఐటీఎస్ జాయింట్ ఎడ్వైజర్ వియస్ రాజు, ట్రాయ్ సీనియర్ రీజనల్ ఆఫీసర్ బిక్షమ్‌లు అన్నారు. శుక్రవారం నరసాపురం మండలంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అవగాహనా సదస్సులో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టెలికమ్ సర్వీసులు, సైబర్ నేరాలను గురించి, వాటిని ఏ విధంగా ఎదుర్కొవాలో వివరిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, ట్రెజరర్ కెవి స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డాక్టర్ స్వామినాథన్, ఈసీఈ విభాగ అధిపతి సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ అభిమానుల ర్యాలీ

భీమవరం (ప్రకాశంచౌక్): వెస్ట్ ఇండీస్‌లో జరిగిన టీ–20 క్రికెట్‌లో ప్రపంచ చాంపియన్‌గా విజయం సాధించిన భారత టీంపై హర్షాతిరేకాలు తెలియజేస్తూ శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అనురాధ మాట్లాడుతూ 17 ఏళ్ల తరువాత టీ–20 వరల్డ్ కప్ ఫైనల్స్‌లో భారత్ విజయం సాధించడం సంతోషదాయకమన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలోనే ఎంతో ఉత్కంఠ భరితంగా సాగిన టీ–20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సౌత్ ఆఫ్రికాపై భారత్ ఘన విజయం సాధించిందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం, పట్టణ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, బార్ చాంబర్ సభ్యులు ఉండపల్లి రమేష్ నాయుడు, కొండ్రు శ్రీనివాస్, ఏవో మావుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వీరవాసరం: ప్రజల ఆరోగ్యం పట్ల, ఆరోగ్య సిబ్బంది ప్రత్యేకశ్రద్ధ కనబరచాలని డీఎంహెచ్‌వో మహేశ్వరరావు తెలిపారు. వీరవాసరం మండలం నందమూరు గరువులో నిర్వహిస్తున్న డ్రైడే.. ఫ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కొబ్బరి డొక్కలు, ట్రాక్టర్ టైర్లు, రుబ్బు రోళ్లు, ఖాళీ సీసాలో నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య పద్ధతులపై ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో దేవదాసు, జి.జగమని, పి.చిట్టిబాబు పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

కాళ్ల: రాష్ట్ర విద్యాశాఖ సూచించిన ఫార్మాట్‌లో రూపొందించిన డైరీని మూడు సంవత్సరాలుగా అందిస్తున్న కాళ్ల మండల యూటీఎఫ్ శాఖకు గోపిమూర్తి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా యూటీఎఫ్ కార్యాలయం భీమవరంలో కాళ్ల మండల శాఖ ఆధ్వర్యంలో దివంగత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి జ్ఞాపకార్థం రూపొందించిన ఉపాధ్యాయ డైరీ ఆవిష్కరణ సభ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఉపయోగపడే కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. సీహెచ్ పట్టాభి రామయ్య, జి.రామకృష్ణంరాజు, బీఆర్ఎంకే స్వామి, ఎం.శంకర్రావు, బీబీ మణి పాల్గొన్నారు.

ఆహారమే.. ఔషధం



మార్కెట్‌లో లభించే పండ్లు



కూరగాయలు

- రోగ నిరోధక శక్తి పెంపులో కీలక పాత్ర
- వాతావరణ మార్పులపై జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు

యలమంచిలి: వేసవికాలం, వర్షాకాలం, సీతాకాలం ఇలా కాలాలు మారే సమయంలో మనుషులు రోగాలకు గురికావడం సహజంగా జరుగుతుంది. కారణం అప్పటి వరకు ఒక విధమైన వాతావరణానికి అలవాటైన శరీరం వాతావరణంలో మార్పు రావడంతో ఏదో రోగం బయటపడుతుంది. అయితే ఇది అందరిలో జరగదు. వృద్ధులు, అనారోగ్యానికి గురైన వ్యక్తులు త్వరగా రోగాలపాలవుతారు. అయితే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినేవారు కాలాలు మారిన వ్యాధులబారిన పడాల్సిన అవసరం ఉండదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అంతే కాకుండా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యాయామం, యోగా చాలా మంచిదని పేర్కొంటున్నారు.

ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు

తాజా కూరగాయలు, తాజా పండ్లు నిత్య ఆహారంలో భాగం చేసుకోవాలి. నిల్వ చేసిన ఆహార పదార్థాలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలి. తీపి పదార్థాలు తక్కువగా, పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ముఖ్యంగా పిజ్జాలు, బర్గర్లు వంటి జంక్ ఫుడ్స్ అసలు తీసుకోకపోవడం మంచిది. కూల్ డ్రింక్స్ తాగకూడదు. డ్రింక్స్‌కు బదులుగా కొబ్బరి నీరు, మజ్జిగతో చేసే లస్సీ, బటర్ మిల్క్, చెరకు రసం తీసుకోవడం ఉత్తమం.

నీరు, పాలకు ప్రాధాన్యం

కలుషిత నీరు తాగడం వలన మనుషులు త్వరగా రోగాలపాలవుతారు. కాబట్టి పరిశుభ్రమైన నీటినే తాగాలి. వర్షాకాలంలో కాచి, వడగట్టిన నీటిని తాగడం ఉత్తమం. నీటితోపాటు పాలు కూడా అవసరం. కనీసం రోజుకి 250 మిల్లీ లీటర్ల (ఒక గ్లాసు) పాలు అయినా తాగాలి. టీ, కాఫీ అలవాటు ఉన్నవారు వాటిని రోజుకి ఒకసారి లేదా రెండు సార్లకు పరిమితం చేసుకోవడం ఉత్తమం.

పప్పు ధాన్యాలు, ఆకు కూరలు

మన ఆహారంలో నిత్యం పప్పు ధాన్యాలు, ఆకు కూరలు ఉండేలా చూసుకోవడం ముఖ్యం. వేరుశెనగ గుళ్లు, మినుములు, శనగలు, బాదం పప్పు, కందిపప్పుతోపాటు ఒక ఆకు కూర తీసుకోవాలి. మార్కెట్‌లో చౌక ధరకు లభించే జామ, నిమ్మ, ఉసిరి వంటి వాటిని ఏదో ఒక దానిని నిత్య ఆహారంలో భాగం చేసుకోవాలి. అలాగే ప్రతి రోజూ ఒక గుడ్డు వారానికి ఒకసారి చికెన్, మటన్, చేప తినడం మంచిది.

మంచి అలవాట్లు ఇలా

భోజనానికి, టిఫిన్‌కి ముందు తప్పనిసరిగా చేతులను శుభ్రం చేసుకోవాలి. ఆహారం వేడిగా ఉన్నప్పుడే తినాలి. దీని వలన ఆహారం రుచి తెలియడమే కాకుండా త్వరగా జీర్ణమవుతుంది. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. ఆహారాన్ని ఒకేసారి ఎక్కువ మొత్తంలో తీసుకోకూడదు. కొంచెం కొంచెంగా ప్రతి మూడు గంటలకు తినడం ఉత్తమం. దీని వల్ల జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది.

జలుబు నివారణ చిట్కాలు

వర్షాకాలంలో ఎక్కువగా జలుబు, దగ్గు వస్తుంది. జలుబు, దగ్గు, ఆయాసం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందడానికి కొన్ని చిట్కాలు పాటించాలి. వీటిని త్వరగా అరికట్టడంలో మిరియాలు, అల్లం, శొంఠి, పసుపు బాగా ఉపయోగపడతాయి. వీటిని నూరి వేడినీళ్లు లేదా పాలలో కలుపుకుని తాగితే తక్షణ ఉపశమనం లభిస్తుంది.

మంచి ఆహారమే ఆరోగ్యం



మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యాన్ని తీర్చిదిద్దుతుంది. పోషకాహారం అంటే అదేదో ఖరీదైన ఆహారం అనుకోవడం పొరపాటు. మనకు నిత్యం మార్కెట్‌లో లభించే తోటకూర, గూంగూర, మెంతికూర, మునగాకు, పాలకూర, బచ్చలి వంటి ఆకు కూరలు, చవకగా దొరికే అరటి, జామ, ఉసిరి, నిమ్మ, బొప్పాయి వంటి పండ్లు, గుమ్మడి, బూడిద గుమ్మడి వంటి వాటిని ఎక్కువగా తీసుకుంటే శరీరానికి కావాల్సిన అన్ని రకాల విటమిన్లు లభిస్తాయి.

– మహ్మద్ హసీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

80 శాతం నారుమడులు పూర్తి



కాజలో రైతులతో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి సీహెచ్ దేవి

యలమంచిలి: వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో రైతులు నారుమడులలో వర్షపు నీరు నిలబడకుండా బయటకు వెళ్లే విధంగా దారులు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ దేవి కోరారు. కాజ గ్రామంలో శుక్రవారం ఆమె పర్యటించి నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ ఆకుమడి వేసిన వారం తరువాత కిలో యూరియా, అర కిలో పొటాష్ చల్లితే ఆకు ఆరోగ్యంగా పెరుగుతుందన్నారు. యలమంచిలి మండలంలో ఈ ఖరీఫ్ పంటకు 5512 ఎకరాలలో వరి పంట సాగవుతుందని అంచనా వేసినట్లు ఆమె చెప్పారు. అందుకుగానూ 275 ఎకరాల నారుమడి అవసరం ఉండగా ఇంత వరకు 202 ఎకరాల్లో రైతులు నారుమడులు పోశారన్నారు. 202 ఎకరాలలో 80 శాతం ఎంటీయూ–1318 రకం విత్తనాలు వేయగా మిగిలిన 20 శాతం మంది రైతులు సంపత్ స్వర్ణ, ఎంటీయూ–1064, పీఎల్ఏ–1100 మూడు రకాల విత్తనాలు చల్లినట్లు ఆమె వివరించారు. ఎంటీయూ–1318 రకం అధిక వర్షాలకు, తుఫాన్‌లకు తట్టుకుని నిలబడే అవకాశం ఉందన్నారు. అందుకే ఎక్కువ మంది రైతులు ఈ రకం సాగు చేయడానికి ఆసక్తి కనపరచినట్లు ఆమె వివరించారు. ఈ విత్తనానికి యూరియా తక్కువగా వాడాలని కోరారు. యూరియా తక్కువ వాడితే పంట త్వరగా కోతకు వస్తుందని దేవి తెలిపారు.

కార్పొరేషన్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న బండారు ఆనంద ప్రసాద్

పెనుమంట్ర: దేవాంగ బీసీలకు కార్పొరేషన్ పదవుల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆలిండియా వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు బండారు ఆనంద ప్రసాద్ అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వట్టం గణేష్ అధ్యక్షతన శుక్రవారం మార్టేరులో శ్రీగౌరీ శంకర కల్యాణ మండపంలో జిల్లా సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆనంద ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తరువాత బీసీలలో అధికశాతం చేనేత కులస్తులే ఉన్నారని, ప్రభుత్వం గుర్తించి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర దేవాంగ సంఘం వ్యవస్థాపక కార్యదర్శి మాడిశెట్టి శివ శంకరయ్య మాట్లాడుతూ ఈ నెల 14న పాలకొల్లులో సంఘం ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గణేష్, కోనసీమ జిల్లా అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యస్వామి, బాపట్ల జిల్లా సంఘ అసోసియేట్ అధ్యక్షుడు బండ్ల బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ద్వార హేమకుమార్, కోశాధికారి అల్లాడ కుమారస్వామి, జిల్లా ప్రతినిధి మానెం బసవరాజు, మావూరి సుందర రావు తదితరులు పాల్గొన్నారు.

సురక్షితమైన తాగునీటిని అందించాలి



ఎమ్మెల్యే నాయకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మొగల్తూరు: గ్రామస్తులకు శుద్ధి చేసిన స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కేపీ పాలెంలో భారీ మంచినీటి ప్రాజెక్టును ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సమయానికి తాగునీరు సరఫరా చేయడంలేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ప్రాజెక్టు ప్రాంగణంలోని ఫిల్టర్ బెడ్లను, నీటిని శుద్ధి చేసే పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్‌ను కేపీ పాలెం సౌత్ సర్పంచ్ అందే వెంకలక్ష్మి, ఎంపీటీసీ సభుడు అందే ముక్తేశ్వరరావు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే నాయకర్

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా కలెక్టరేటు జిల్లా కలెక్టరు చాంబరులో జిల్లా కలెక్టరు సి.నాగరాణిని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందజేశారు.

వైభవంగా మావుళ్లమ్మ జాతరలు



సిద్ధాంతంలో ఆకట్టుకున్న ప్రత్యేక వేషధారణ



మార్టేరులో ప్రభల ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ వారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 2 నుంచి ప్రారంభమైన ఉత్సవాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతరలో గరగ నృత్యాలు, నృత్య ప్రదర్శనలు, విచిత్ర వేషాలు, శక్తి రూపాలతో అలరించాయి. శుక్రవారం ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు భారులు తీరారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మావుళ్లమ్మ ఫ్రెండ్స్ యూనియన్, ఆలయ కమిటి సభ్యులు ఏర్పాట్లు చేశారు. జాతర సందర్భంగా మంగళవారం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

మార్టేరులో

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు గ్రామంలో ఉన్న శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 110వ జాతర ప్రభల ఉత్సవ కార్యక్రమం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రభల ఉత్సవంలో పాల్గొన్నారు. అమ్మవారి కాళికాప్రభ ఊరేగింపులో పెద్ద ఎత్తున మహిళలు పిల్లలు పాల్గొని అమ్మవారి ప్రభల ఉత్సవాన్ని తమపై నుండి దాటించుకున్నారు. ఊరేగింపులో గరగనృత్యాలు, డప్పు వాయిద్యాలతో పాటు కాళికామాత నృత్యాలు, దేవీ నృత్యాలు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో అల్లాడి కుమారస్వామి, మాన్యం రవికుమార్, బళ్ల మాసరయ్య, కొడవటి వెంకటరమణ, కొండపల్లి రమేష్, రొబ్బి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



శ్రీనివాసరావుకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

పోడూరు: జిన్నూరు గ్రామానికి చెందిన సాయి దుర్గాశ్రీనివాసరావు(17) కొంతకాలంగా నరాల బలహీనత, ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులకు వైద్యం చేయించే స్థోమత లేదని తెలుసుకున్న వసుధ ఫౌండేషన్ ఏరియా కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు సంస్థ చైర్మన్ మంతెన వెంకటరామరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి తమ ఫౌండేషన్ ద్వారా శ్రీనివాసరావు వైద్య ఖర్చులకు రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. సంబంధిత చెక్కును ఏరియా కన్వీనర్ బుద్ధరాజు శుక్రవారం జిన్నూరులో శ్రీనివాసరావుకు అందజేశారు.

ఆకట్టుకున్న అల్లూరి ఫొటో ఎగ్జిబిషన్



శివదేవునిచిక్కాలలో ఏర్పాటు చేసిన అల్లూరి ఫొటో ఎగ్జిబిషన్

పాలకొల్లు అర్బన్: స్వాతంత్ర్య ఉద్యమ అమరవీరుల్లో అల్లూరి సీతారామరాజు ఆదర్శమూర్తి అని వారి జీవితం విద్యార్థులకు స్ఫూర్తి దాయకమని పాఠశాల హెచ్ఎం పి.రాము అన్నారు. మండలంలోని శివదేవునిచిక్కాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ముందుగా అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అల్లూరి జీవిత విశేషాలు, విశాఖ జిల్లా పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో మన్యం వీరుడు అల్లూరి చేసిన పోరాటాలు, పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి ఆయుధాలు ఎత్తుకెళ్లిన సంఘటనలు, అలాగే పోలీస్ జనరల్ డైరీలో అల్లూరి చేసిన సంతకాల ఫొటోలను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గూట్ల కుమార్, ఉపాధ్యాయులు ఎ.సత్యనారాయణ, వీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ



విద్యార్థులకు బస్‌పాస్‌లు అందిస్తున్న 1981 బ్యాచ్ విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: గత కొన్ని సంవత్సరాలుగా పూర్వ విద్యార్థి సంఘం నుంచి విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్నామని బీఆర్ఎంవీ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు వట్టం గణేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక బీఆర్ఎంవీ మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 1981 పూర్వ విద్యార్థి సంఘ నాయకులు 150 మంది విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేశారు. పూర్వవిద్యార్థి గణేశ్వరరావు మాట్లాడుతూ పాలకొల్లులో విద్యనభ్యశించడానికి దిగమర్రు, గోరింతాడ, సగంచెరువు వంటి దూరప్రాంతాల నుంచి ఆర్‌టీసీ బస్ ద్వారా పాఠశాలకు వస్తున్నారని తెలిపారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజులు వంటివి చెల్లిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘ సెక్రటరీ కె.సాంబశివరావు, పాఠశాల హెచ్ఎం ఎస్.ఝాన్సీలక్ష్మి, వి.ఉదయ్‌కుమార్, ఆర్‌టీసీ స్టాఫ్ పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



చింతపర్రులో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: సీజనల్ వ్యాధులపై ప్రతి గ్రామంలోనూ ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించి వ్యాధుల తీవ్రతను ప్రజలకు తెలియజేయాలని మెడికల్ ఆఫీసర్ డా.అడ్డాల ప్రతాప్‌కుమార్ కోరారు. పాలకొల్లు మండలం చింతపర్రులో డ్రై డే ర్యాలీ నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో డ్రై డే ర్యాలీ నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఇంటి పరిసరాల్లో మురుగు గుంటలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరికైనా జ్వర లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా గ్రామంలోని ఏఎన్ఎం, ఆశ వర్కర్లను సంప్రదించాలని కోరారు. సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, మెడికల్ ఆఫీసర్ ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, సూపర్‌వైజర్లు ఎస్‌కే అమలేశ్వర రావు, డి.కమల తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్‌అండ్‌టీ వద్ద సంగీత సువార్త సభ

పాలకొల్లు అర్బన్: పట్టణ శివారు పెంకుళ్లపాడు ఎల్ అండ్ టీ సముదాయంలో శనివారం రాత్రి 7గంటలకు సంగీత సువార్త సభ నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ మట్టా జాన్‌మోజెస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సువార్త సభలో మంత్రి నిమ్మల రామానాయుడుతో పాటు రెవ.శ్రీకాంత్ క్రిష్, సింగవరపు విలియం రాజ్‌కుమార్, బిషప్ డా.విల్సన్ సింగం, పీఎస్ జ్ఞాన సుందర్ తదితరులు పాల్గొని వాక్య పరిచయం చేస్తారని పేర్కొన్నారు.

నేడు ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు

నరసాపురం రూరల్: జూనోసిస్‌డేను పురస్కరించుకుని శనివారం నరసాపురం పట్టణంలోని ఏరియా పశువైద్యశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశువైద్యుడు సురేంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేస్తామన్నారు. ఈ అవకాశాన్ని కుక్కలను పెంచుకునేవారు వినియోగించుకుని వారి పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని కోరారు.

పి.పోలవరంలో రక్తదాన శిబిరం

పోడూరు: వంగవీటి మోహనరంగా జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆశ్రయ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పి.పోలవరం గ్రామంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులతో పాటు పలువురు వంగవీటి రంగా అభిమానులు శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆశ్రయ ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ హరీష్ రాయల్ మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారులు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పేషెంట్ల కోసం రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చొప్పవర పు చంద్రవంశీ, తుమ్మా కరుణాకర్, తుమ్మా మణికంత తదితరులు పాల్గొన్నారు.

బాల్య సంరక్షణపై అవగాహన

ఆకివీడు: బాల్యంలో పిల్లల ఆహారం పట్ల తల్లులు జాగ్రత్తలు పాటించాలని, పౌష్టికాహారం అందజేసేలా కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు ఆర్వీ నారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని అజ్జమూరు గరువు ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం బాల్య సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆయన పలు సూచనలు చేశారు. 3–6 సంవత్సరాల లోపు పిల్లలకు ఆరోగ్యం, పోషణ, స్వేచ్ఛ, రక్షణ, విద్య, పౌష్టికాహారం అందజేయడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.